తొలకరి

# ప్రేమంటే

– డాక్టర్ జగిరాల గోపాలకృష్ణ




## సాయం సంధ్య

పగలంతా లోక సంచారంతో అలసిన సూర్యుడు రేరాణితో సంగమానికై పశ్చిమాద్రిలోకి జారుకుంటున్నాడు. మనోజ్ఞమైన నీరెండ కాంతులు సముద్రంపై ప్రతిఫలించి అందానికే భాష్యం చెబుతున్నట్టు ఉన్నాయి.

ఆ సమయంలో చల్లని ఇసుకపై పడుకుని, అలా సముద్రం వైపు చూస్తూ వుండడం నాకు చాలా ఇష్టం.

సముద్రాన్ని ఎపుడు చూసినా నాకు ఒక్కటే అనిపిస్తుంది – కెరటం అటు సముద్రంలో నిలువలేక, ఇటు ఆకాశాన్ని చేరలేక సతమతమవుతోంది అని. అర్థంలేని నా ఆలోచనకు నాకే నవ్వొచ్చింది.

ఇంతలో "రవీ!" అన్న పిలుపు.

ఆలోచనల సాగర మధ్యంలో వున్న నా మనసు, ఆ పిలుపుతో ఒక్కసారిగా జాగృతమై, అచేతనావస్థలోంచి చేతనావస్థలోకి వచ్చింది.

కళ్ళు తెరిచి చూశాను. అంతే... సమీపంలోని ఈ కెరటాల ఘోష వీచిలోని అల్లరి, చల్లని చిరుగాలి ఇవేవీ నాకు తెలియడం లేదు.

ఎదురుగా... నా ప్రేమైకమూర్తి... నా ఆరాధ్య దేవత... నీలిమ!

వేయి సంవత్సరాల తపస్సుతర్వాత భగవంతుడు ప్రత్యక్షమైతే ఆ భక్తునిలో పొంగే భావన నాలో...

"గుర్తుపట్టావా?" అడిగింది తను.

– ఎలా మర్చిపోతాను నేస్తం! నిన్ను.

నీ చూపుల తూపులే కదా నా గుండె గానాన్ని లయ తప్పించింది. నీ నవ్వుల పువ్వులే కదా నా హృదయాన్ని సమ్మోహితం చేస్తే అది నేటికీ అలానే వుండిపోయింది. అలాటిది నిన్ను మర్చిపోవడమంటే నన్ను నేను మర్చిపోవడమే కాదా నేస్తం–

"ఏం మాట్లాడవు" మళ్ళీ తనే అంది.

– ఏం చెప్పను నేస్తం!

నిన్నుచూడగానే శతాధిక భావపరంపర ఒక్కసారిగా ఉద్దీప్తమై ఆ అవ్యక్త భావ ఘోష వ్యక్తమవడానికి అక్షర రూపం దొరక్క అలా నా గుండె గదుల్లో నిలచిపోయిందని చెప్పనా! లేక

నీ పాపిట మెరిసే సిందూరం నా భావప్రవంతికి అడ్డుకట్టవేసిందని చెప్పనా! ఏం చెప్పను నేస్తం –

"ఇదిగో నిన్నే పిలిచేది" మళ్ళీ రెట్టించింది తను.

ఇంతసేపూ తనే మాట్లాడుతోందన్న విషయం అపుడుగానితోచలేదు నాకు. అపుడు చూసాను తనని పరీక్షగా.

పదేళ్ళు పైన గడచిపోయినా తనేం పెద్దగా మారలేదు. కొంచెం ఒళ్ళుచేసింది. ఆ కళ్ళు అలానే భావస్ఫోరకంగా వున్నాయి. కాని కళ్ళ చుట్టూ బాధల వలయాల్లా నల్ల చారికలు. అయినా నా పిచ్చిగాని హాయిగా పెళ్ళిచేసుకున్న తనకేం బాధలు!

"ఎలా వున్నావ్ నీలిమా" పదేళ్ళ తర్వాత తనతో నేను మాట్లాడిన మొదటి మాట అది.

"నా సంగతికేం కాని నువ్వేం చేస్తున్నావ్?" తిరిగి ప్రశ్నించింది.

"హైదరాబాదు ఏ.జి. ఆఫీసులో."

"మరిక్కడ...!?!" అర్థోక్తిలోనే ఆగిపోయింది.

"సముద్రాన్ని... ఆ సముద్రంలో ఎగసే కెరటాల్ని చూడటానికి వచ్చాను."

"అంటే...?" అర్థంకానట్టు అడిగింది.

– బడబాగ్నిని తనలోనే దాచుకుని పైకి నిర్మలంగా కనిపించే ఆ సముద్రమే నా కిపుడు ప్రియనేస్తం అంటే నీకు అర్థమవుతుందా నేస్తం –

"ఆదంతేలే" తేలిగ్గా నవ్వేశాను.

"ఎన్ని రోజులుంటావ్ వైజాగ్‌లో" ప్రశ్నించింది తను.

"ఇంకా ఓ నాల్గు రోజులు. అంతే"

కాసేపు మా ఇద్దరి మధ్య మౌనం రాజ్యమేలింది. చివరికి తనే ఆ మౌనాన్ని ఛేదించింది నెమ్మదిగా.

"రేపు మా ఇంటికి రాగలవా రవీ! నీతో చాలా మాట్లాడాలి" ఆ కంఠంలో అర్థింపు. జాగ్రత్తగా గమనించి వుంటే ఆ కంఠంలో ధ్వనించిన గాద్గదికత నాకు వినబడేదేమో. అప్రయత్నంగానే వస్తానన్నట్లు తల ఊపాను. విజిటింగ్ కార్డు నా చేతిలో పెట్టి వెనుదిరిగింది తను. నిశ్శబ్దంగా చూస్తూ వుండిపోయాను నేను.

నిశ్చలమైన నా మనో సముద్రంలో ఆమె రాకతో జనించిన ఆలోచన సుడిగుండాలు నన్ను గతంలోకి లాక్కుపోయాయి.

***

అపుడు జీవితాన్ని రంగుటద్దాల్లో చూసే వయసు నాది.

ఇంటి దగ్గర అమ్మా నాన్నా పంపించే డబ్బుల్తో అల్లరిగా తిరుగుతూ కాలేజిలో చదువుతున్న రోజులవి.

అపుడు కాలేజిలో నేను నిక్‌నేమ్ పెట్టని లెక్చరర్ లేడు. నేను టీజ్ చెయ్యని అమ్మాయి లేదు. నా చుట్టూ వున్న వాతావరణం, నాతో వుండే స్నేహితులు అంతా నన్నొక హీరోలా చూసేవారు.

అలా ఏ ధ్యేయమూ లేకుండా నా జీవితంలో ఒక ముఖ్య అధ్యాయం పూర్తికాబోతున్న తరుణంలో జరిగిందా సంఘటన.

ఆ రోజు నా ఫ్రెండ్సంతా హడావుడిగా వున్నారు. "ఏమిటి విశేషం" అని అడిగితే, "మన క్లాసులోకి కొత్త అమ్మాయి వస్తోంది గురూ! కాలేజి బ్యూటీ అవుతుందనుకో!" అన్నాడు ఒకడు. నాకూ కుతూహలం కలిగింది – ఇంకో అమ్మాయిని టీజ్ చేయొచ్చుగదా అని. అంతేకాని ఆ క్షణంలో నాకే ఉద్దేశమూ లేదు. అలా ఆలోచనలతోనే క్లాసులోకి అడుగుపెట్టాను.

అటెండెన్స్ తీసుకుంటున్నారు తెలుగు లెక్చరర్.

"నీలిమా...?" పిలిచింది మాస్టారి కంఠం.

"ఎస్ సర్!" కాలంకాని కాలంలో కోయిల కూసినట్టైంది.

ఒక్కసారిగా ఇరవై జతల కళ్ళు ఆ సమాధానం చెప్పిన వైపుకు తిరిగాయి.

వాళ్ళతోపాటు అసంకల్పితంగా అటువైపు చూసిన నాకు... ఓహ్... అనుభూతిని వర్ణించడానికి తెలుగులో నాకు తెలిసిన భాష చాలదు.

చిత్రం! ఏ అమ్మాయిని చూసినా నిక్‌నేమ్ పెట్టే నేను. ఈ అమ్మాయిని చూడంగానే నన్ను నేను మరిచి మౌనంగా వుండిపోయాను.

నా హృది వీణ తంత్రుల్ని ఎవరో మీటినట్లుగా నాలో సన్నని ప్రకంపన! అంతే... నా పాత జీవితానికి తెర దించేశాను.

ఫ్రెండ్స్ లేరు. షికార్లు లేవు.

ఆమె ముఖారవిందాన్ని ఈ రోజు చూడకపోతే మరిక ఆ అవకాశం వుండదేమో అన్నంత ఆత్రుతతో క్లాసులకు రెగ్యులర్‌గా అటెండ్ అయ్యేవాడ్ని. ఏ ఒక్కరోజైనా ఆమె రాకపోతే ఇక ఆ రోజు నాకు నిద్రపట్టేది కాదు. నా అవస్థ చూసి ఫ్రెండ్సంతా రకరకాల కామెంట్స్ చేయడం మొదలెట్టారు. నాకు మాత్రం ఆ అమ్మాయిని చూసినపుడల్లా అదోరకమైన పవిత్ర భావన! భాస్కరుని తీక్షణతకు ఆ అందాల మోము కమిలిపోకుండా నేనే ఛత్రమై నిలవాలన్న ఆవేశం!

ఆ పాదపద్మాలు ఎండకు కందిపోకుండా ఆమె పాదుకలు కావాలన్న ఉద్వేగం!

ఓ చిలిపి పవనం ఆమె ముంగురులతో అల్లరిపెడితే, ఆమె పైటతో సయ్యాట లాడితే ఆ సమీరం పైనే చెప్పలేనంత కోపం కలిగేది నాకు! దాన్నే ప్రేమ అంటారా... ఏమో... నాకు అప్పట్లో తెలిసేది కాదు.

అలా చూస్తుండగానే సమయం గడిచిపోయింది. ఇంకో అన్నెల్లలో ఫైనలియర్ పరీక్షలు. ఆ తర్వాత కాలేజీకీ మాకూ రుణం తీరిపోతుంది. ఇంతకాలం ఆమెకు దూరంగా వుండి ఆరాధించడమే తప్ప ఆమెతో మాట్లాడలేదు నేను. కాని పరీక్షలు దగ్గరపడేకొద్దీ ఆమెకి నా ఆరాధన నివేదించాలన్న ఆరాటం ఎక్కువైంది నాలో. దాని ఫలితమే ఒక లెటర్ రాసాను నీలిమకు.

*"... ... ...!*

*నన్నునేను ఎలా సంబోధించుకోవాలో తెలియక, దానిజోలికి పోవడంలేదు.*

*మిమ్మల్ని మొదటిసారి చూసాకే నేనేమిటో నాకు తెలిసింది!*

*మిమ్మల్ని కలిసాకే తెలిసింది అందానికి నిర్వచనం ఏమిటో!*

*అలాంటి అందానికి జతగాడినై ఒక జీవిత కాలం తోడుగా*

*నిలవాలన్న ఆశతో వున్నాను నేను –*

*అన్యాథా మీరు భావించకపోతే!*

*– రవి*

లెటర్ చదువుతున్న ఆమె మొహంలో భావాల్ని చదవడానికి ప్రయత్నించాను. ఉహూ. కుదర్లేదు. అదే... ఆ భావగంభీరత్వమే నన్ను ఆకట్టుకుంది.

లెటర్ పూర్తిగా చదివిన తర్వాత నెమ్మదిగా తల పైకెత్తింది తను. అపుడు... అపుడు చూసాను ఆమె

కళ్లను... ఆ నీలి కళ్ళ నాపై నింపుకున్న అసహ్యాన్ని!

నెమ్మదిగానైనా స్థిరంగా అంది తను –

"నువ్వంటే నాకు అసహ్యం. ఇంకో సారి నీ ముఖం నాకు చూపించకు. ఐ హేట్ యు" అని చరచరా మిన్నాగులా కదిలిపోయింది తను.

ఆ క్షణం పుస్తకాల్లో రాసేటట్లుగా పర్వతాలు కుంగిపోలేదు. సముద్రం హోరెత్తలేదు. కాని నా మనసు మాత్రం... మొద్దుబారిపోయింది.

నా గత జీవితం, అంతకు ముందు నేను చూపించిన హీరోయిజం నాముందు వికృతంగా నర్తిస్తుంటే సిగ్గుతో తలవంచుకున్నాను. అంతే... ఆ మరుక్షణం కాలేజీ వదిలేశాను. ఆ మర్నాటికి ఆ ఊరే వదిలేశాను శాశ్వతంగా.

ఇంత జరిగినా చిత్రం! నాకు నీలిమ మీద కొంచెం అయినా కోపం రావడం లేదు. తప్పంతా నాదే అనిపిస్తోంది. అందుకే అంటా రనుకుంటాను. "నిజమైన ప్రేమలో ద్వేషానికి తావు లేద"ని!

ఆ తర్వాత నేను తిరగని ప్రదేశం లేదు. చేయని ఉద్యోగం లేదు. అలా జీవితంతో పోరాడుతూ చివరికి ఓ ఉద్యోగం సంపాదించుకుని జీవితంలో సెటిలయ్యా – సామాన్య జనం పరిభాషలో.

***

అడ్రసు వుండడంతో ఇల్లు తేలిగ్గానే దొరికింది.

కాలింగ్ బెల్ నొక్కగానే తలుపు తీసింది నీలిమ. నా కోసం చాలా సేపు నుంచి ఎదురుచూస్తున్నట్లుంది. ఆమె కళ్ళల్లో నిరీక్షణ తాలూకు నిడుగు.

"లోపలికి రా" దారి ఇచ్చింది.

నమ్రతనే గదిని పరీక్షగా చూశాను నేను.

అందంగా అమర్చిన ఫర్నిచరు, చక్కని పెయింటింగ్స్ ఆ ఇంటి యజమాని అభిరుచిని చూపిస్తున్నాయి. గోడమీద వున్న ఫామిలీ ఫోటో నన్ను ఆకర్షించింది. నీలిమకు సరైన జోడి దొరికాడనిపించింది అది చూశాక.

"కాఫీ తీసుకుంటావా రవీ!"

వద్దన్నట్లు తల ఊపాను. "ఏదో మాట్లాడాలన్నావు..." సందిగ్ధంగా ఆగిపోయాను నేను.

నేల మీద కాలి బొటనవేలితో గీస్తోంది తను.

"నువ్వు నన్ను అపార్థం చేసుకోకూడదు" అనేసి మళ్ళీ తల దించుకుంది.

"ఏమిటి విషయం" నేను ఈ సస్పెన్సును భరించలేకపోతున్నాను.

"నేను... నేను నీతో వచ్చేస్తాను" నెమ్మదిగా డైనమైట్ పేల్చింది.

ఆ క్షణం నా గుండె చప్పుడు నాకే వికృతంగా వినబడేంత నిశ్శబ్దం ఆవరించింది మా మధ్య. నిశ్శబ్దం ఎంత భయంకరమో అప్పుడే తెలిసింది నాకు.

"తాగుడు ఏమైనా..." ఇంకా నేను పూర్తిచేయలేదు "ఉహు" అడ్డంగా తల ఊపింది.

"మరి ఆఫీసులో ఎవరితోనైనా..." ఎలా అడగాలో తెలీక ఆగిపోయాను.

"ఊహు. అటువంటిదేం లేదు" అంది తను.

"మరెందుకు నీలో ఈ అసంతృప్తి?" రెట్టించాను నేను.

ఆ మాటకు ఆమెలో ఎన్నాళ్ళుగా దాగుందో ఏమో. ఓ మంచు పర్వతమంత వేదన కరిగి కన్నీళ్ళై ప్రవహిస్తుండగా వెక్కిళ్ళ నడుమ చెప్పింది – "మొదట్లో బాగానే చూసుకునేవారు. కాని బాబు పుట్టాక ఎందుకో నేనంటే ప్రేమ తగ్గినట్టుంది. ఇదివరకు రోజూ సాయంత్రం పూలు తెచ్చేవారు. ఇపుడు బాబుకు స్వీట్లు తెచ్చేది మాత్రం గుర్తుంటోంది."

కూతురి నుంచి భార్య, భార్య నుంచి తల్లి అనే మెటమార్ఫసిస్ ప్రక్రియలో భార్య స్టేజిలోనే ఆగిపోయి తల్లితనాన్ని గుర్తించలేకపోతున్న నీలిమను చూస్తుంటే నాలో జాలి పెరిగిపోతోంది.

ఎక్కడో అరుదుగా ఎదురుపడే ఈ సమస్య నీలిమకు రావడం విశేషం.

"నీలిమా! నీకు నీ బాల్యం గుర్తుందా" అడిగాను నేను. ఆమెను దారిలోకి తెచ్చే ప్రయత్నంలో.

"నిన్ను మీ నాన్న ముద్దు చేస్తుంటే మీ అమ్మ ఇలా ఎప్పుడైనా బాధపడిందా" అడిగాను. లేదన్నట్టు తల ఊపింది తను.

నీలిమ నా ఆలోచనలని క్యాచ్ చేయగలుగుతోంది. కాని కన్విన్సు కాలేదు. ఆమె మొహంలో ద్వైత భావం కదలాడుతూనే వుంది.

"అయితే సరే! నువ్వు నాతో వస్తావు! మరి నీ బాబు? అంత ప్రేమగా చూసుకునే తండ్రిని వదిలి రాగలడా? బాబు లేకపోతే – బాబు లేకుండా – నువ్వునాతో రాగలవా?"

నాకు కావాల్సిన రియాక్షను అపుడు కన్పించింది ఆమె మొహంలో. "చూడు నీలిమా! వయసుతోబాటు మన ఆలోచనలూ ఎదగాలి. నీ సంసారంలో ఎదురైన ఈ చిన్న అసంతృప్తిని ఎపుడో నేను చూపించిన ప్రేమను అన్వయించుకుని నన్ను నీ జీవితంలోకి ఆహ్వానిస్తున్నావు. ఇంత పిచ్చి ఆలోచన చేయడానికి తగిన కారణం ఏదీ నీ జీవితంలో లేదు, కేవలం నీ మానసిక దౌర్బల్యం తప్ప! ఇలాటి పిచ్చి ఊహాలతో నీ సంసారాన్ని పాడుచేసుకోకు" అన్నాను నేను.

కఠినంగా ఉన్నా, తనని దారిలో పెట్టడానికి అలా మాట్లాడక తప్పలేదు నాకు. "పోనీ నువ్వు కూడా వైజాగ్ ట్రాన్స్ఫర్ చేయించుకోకూడదా" ఆమె కంఠంలో ఒకప్పుడు నా ప్రేమను తిరస్కరించినందుకు గిల్టీనెస్ ధ్వనించింది.

ప్రేమ అంటే దగ్గరితనం అనే టీనేజి భావాల్లోంచి బయటపడలేకుంది తను.

తనకు కలిగిన చిన్న అసంతృప్తి, తద్వారా నా మీద పెంచుకున్న ఈ తాత్కాలిక ప్రేమ మొగ్గలోనే తుంచకపోతే ఆమె సంసారానికి కష్టం అనిపించింది నాకు.

అందుకే లేని కాఠిన్యాన్ని తెచ్చుకున్నాను.

"చూడు నీలిమా! నీకు నేనంటే ఎపుడూ అభిమానం లేదు.' ఇపుడు నా మీద చూపించిన ఈ అభిమానానికి కారణం నీ అసంతృప్తి. అందుకే ఈ పదేళ్ళుగా గుర్తుకు రాని నేను ఇపుడు గుర్తొచ్చాను. ఇక నా ప్రేమంటావా, అదెప్పుడో పదేళ్ళ కిందటి మాట. అదిప్పటికీ అలానే వుందని నాకే నమ్మకం లేదు."

చివరి మాటలంటున్నపుడు అబద్ధం ఆడటం రాని నా గొంతు వణికింది. నేను చెప్పిన రీజనింగుకో, మరి నేనన్న చివరి మాటలకో కాని ఆమె మనసులోని సందిగ్ధం అంతా ఎగిరిపోయినట్టు తేటపడ్డ ఆమె మొహం చెబుతోంది. "మళ్ళీ ఎపుడు కనబడతావు" అడిగింది తను.

– నాకు ఈ ఊరన్నా, సముద్రమన్నా ఎంతో ఇష్టం! కానీ నేస్తం! నువ్వన్నా నీ సుఖమన్నా మరీ మరీ ఇష్టం. అందుకే నాకై నేను విధించుకుంటున్నా ఈ ఊరు నుంచి శాశ్వత బహిష్కారాన్ని –

కానీ ఇవేవీ నా మనసు దాటి బయటికి రాలేదు. ఒక నవ్వు, మందహాసమే ఆమెకు సమాధానమైంది.

